క్లుప్తంగా

కుమారస్వామికి షష్టి పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురువారం షష్టిని పురస్కరించుకుని ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి గురువారం సందర్భంగా ఈఓ ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

పూడికతీత పనులు



పూడిక తీయిస్తున్న సర్పంచ్ జయపాల్

వెలుగోడు: పట్టణ శివారులోని ఊటు కాల్వలో పేరుకుపోయిన పూడికను సిబ్బంది తొలగించారు. సర్పంచ్ వేల్పుల జయపాల్, ఈఓ నాగేంద్రగౌడ్ గురువారం దగ్గరుండి పనులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు ఇళ్ల మధ్యలో నిలిచిపోవడంతో యుద్ధప్రాతిపదికన మురుగు తొలగించే పనులను చేపట్టారు.

అలరించిన నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనలో కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై నందికొట్కూరుకు చెందిన లిక్షితాశ్రీ నృత్యకళాశాల వారి సంప్రదాయ నృత్యప్రదర్శన అలరించింది. ప్రణవాకారం, శివ స్తుతి, లింగాష్టకం, శివతాండవం, మహాదేవ శివ, అయిగిరినందిని తదితర గీతాలకు డి.లిక్షితాశ్రీ, పునర్విత, కల్యాణి, ప్రజ్ఞ తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: అన్నమయ్య జిల్లా గుర్రంకొండ మండలానికి చెందిన ఏపీఎం రజనిపై జరిగిన దాడిని ఖండిస్తూ వెలుగు సిబ్బంది మండల సమాఖ్య కార్యాలయ ఆవరణంలో గురువారం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వెలుగు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఏపీఎం పుల్లయ్య, సీసీలు వెంకటరమణ, శివుడు, రత్నకుమారి, నరసింహుడు, బాలరాజు, హరి సుధ, శేఖర్, అబ్దుల్, బాలిరెడ్డి, సాంబశివుడు, సాలమ్మ, సరోజ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

ఘాట్‌ల వద్ద డ్రోన్ కెమెరాల ఏర్పాటు

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ సమీపంలో ఉన్న మూర్వకొండ, అర్లపాడు ఘాట్‌ల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కృష్ణానది బ్యాక్‌వాటర్‌లో ఇంజిన్ బోట్ల ప్రయాణంపై నిషేధం ఉందన్నారు. నెహ్రూనగర్‌కు చెందిన గంగపుత్రులు మూర్వకొండ ఘాట్ నుంచి తెలంగాణ రాష్ట్రం మంచాలకట్ట వరకు అనుమతి లేకుండా ఇంజిన్ బోట్లు నడుపుతుండటంతో ఈనెల 11న మూర్వకొండ ఘాట్‌ను సందర్శించి హెచ్చరికలు జారీ చేశామన్నారు. అటు తెలంగాణలోని పెంటవెల్లి, చెన్నంబావి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ, సీఐలతో మాట్లాడి నదిలో బోటు ప్రయాణాన్ని నిలుపదల చేయిస్తామన్నారు. కృష్ణానది బ్యాక్‌వాటర్ అందాలు తిలకించేందుకు వచ్చే పర్యాటకులు నది లోపలికి వెళ్లకుండా రెండు ఘాట్‌ల వద్ద పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎగువ నుంచి కృష్ణానదికి వరద నీరు ఉధృతంగా వచ్చి చేరుతోందని శ్రీశైలం బ్యాక్‌వాటర్ నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 883 అడుగులకు చేరుకుందని నది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

శ్రీశైలంటెంపుల్: కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 16న శ్రీశైల ఆలయ ప్రాంగణంలో గోపూజ నిర్వహించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులం వద్ద గోవులకు, గోవత్సములకు (దూడలకు) శనివారం ఉదయం 9గంటలకు పూజాదికాలు ఉంటాయన్నారు. గోసంరక్షణశాలలో కూడా గోపూజ జరిపిస్తామన్నారు.

రైతుల కష్టం వర్షార్పణం

- పంటలను ముంచెత్తుతున్న వర్షపు నీరు
- రోజురోజుకు పెరుగుతున్న నీటి ప్రవాహ ఉధృతి
- శివపురం వద్ద పొంగిపొర్లుతున్న ఎద్దులేరు



ఎద్దులేరు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి



గువ్వలకుంట్ల సమీపంలో చెరువును తలపిస్తున్న వరిపంటపొలాల్లో నిలిచిన వర్షనీరు



కొత్తపల్లి కనికలమ్మ చెరువు వద్ద గంపలతో చేపలవేట చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: ఎడతెరిపినివ్వకుండా కురుస్తున్న వర్షాలకు కొత్తపల్లి మండల రైతుల కష్టం నీటిపాలైంది. బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు మరోమారు 40.6 మి.మీల వర్షపాతం కురిసింది. వాగులు, వంకలు, చెరువులకు ఉన్న అలుగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పంటపొలాలను వర్షపునీరు ముంచెత్తడంతో చెరువులను తలపిస్తున్నాయి. పొలాల్లో నిలిచిన నీరును చూసి రైతులు ఆందోళన చెందుతున్నారు. గువ్వలకుంట్ల ఎస్సీ కాలనీలోకి వర్షపు నీరు చేరడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడు ఏ గ్రామం చెరువు తెగుతుందోనని ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కొత్తపల్లి సమీపంలోని కనికలమ్మ చెరువు అలుగు పారుతుండడంతో కొట్టుకొస్తున్న చేపలను పట్టుకునేందుకు యువకులు ఉత్సాహం చూపారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

శివపురం, ఎం.లింగాపురం గ్రామాల మధ్య ఉన్న ఎద్దులేరు పొంగిపొర్లుతోంది. దీంతో దాదాపు 12 గ్రామాలకు మండల కేంద్రంతో రాకపోకలు తెగిపోయాయి. అత్యవసరాల నిమిత్తం కొందరు నీటి ప్రవాహాన్ని సైతం లెక్కచేయకుండా వాగును దాటుతున్నారు. వరదరాజ స్వామి ప్రాజెక్టు కాల్వ, పాలెం చెరువు వద్ద రాయిసెల కాల్వ, గుండ్ల అలుగు కాల్వ, సుద్దవాగు, నందికుంట వద్ద కురుకుంద చెరువు అలుగు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. తహసీల్దార్ ఉమారాణి, ఎస్‌ఐ జయశేఖర్ ఎద్దులేరును పరిశీలించారు. వాగును ఎవరూ దాటవద్దని ప్రజలకు సూచించారు. అనంతరం సిబ్బందిని కాపాలాగా ఉంచారు.



ప్రమాదకరంగా ప్రవహిస్తున్న ఎద్దులేరువాగును దాటుతున్న ప్రయాణికులు

విరామమివ్వని వరుణుడు

మహానంది: వరుణుడు విరామం ఇవ్వడం లేదు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గురువారం మహానంది మండలంలో 14.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. పలు గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లో వర్షపునీరు చేరుతుందేమోనని ఆయా కాలనీలవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వర్షంతో ఇబ్బందులు పడుతున్నారు.



మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం



గువ్వలకుంట్ల ఎస్సీకాలనీలో ఇంట్లోకి చేరిన వర్షపునీరు

ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి

పాములపాడు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు అటవీ ప్రాంతం నుంచి వస్తున్న నీటితో మండలంలోని భవనాసి, సుద్ద వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో వాగు సమీప పంట పొలాల్లోకి నీరు చేరి పైర్లు పూర్తిగా మునిగిపోయాయి. ఇస్కాల గ్రామ సమీపంలోని భవనాశిసి నది ఒడ్డున వెలసిన శ్రీశైల ప్రథమ ద్వారం నందీశ్వర ఆలయం నీటిలో మునిగిపోయింది. నది ప్రవాహం ఎక్కువ కావడం, వర్షపు నీరు అధికంగా ప్రవహిస్తున్నడంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. వాగు పరివాహక ప్రాంతంలో ఉన్న చెలిమిళ్ల, లింగాల గ్రామాల పంట పొలాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాసి

భక్తులకు వసతి కల్పన

శ్రీశైలంటెంపుల్: కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ ద్వారా హటకేశ్వరం, శిఖరేశ్వరం ఆలయాల వద్ద యాత్రికుల సౌకర్యాల కేంద్రాలలో శుక్రవారం నుంచి భక్తులకు వసతి కల్పించనున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఈఓ మాట్లాడుతూ భక్తుల వసతి కోసం రెండు బంకర్ బెడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఒక్కో బెడ్ రోజువారి అద్దె రూ.60 నిర్ణయించామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ హేమలత

ఆత్మకూరు: ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని ఏడీఏ హేమలత దుకాణాదారులను హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు, రికార్డులు, ధరల పట్టికను పరిశీలించి డీలర్లకు పలు సూచనలిచ్చారు. రైతులకు కచ్చితంగా రసీదు ఇవ్వాలన్నారు. యూరియా కొనుగోలు కోసం వచ్చిన రైతులకు ఇతర మందులు, ఎరువులు అంటగట్టరాదన్నారు.

తిమ్మాపురంలో మౌలాలిస్వామి జార్తలు

మహానంది: మండల కేంద్రం ఎం.తిమ్మాపురం గ్రామంలో గురువారం రాత్రి మౌలాలిస్వామి జార్తలు నిర్వహించారు. గ్రామస్తులు కులమతాలకు అతీతంగా పీర్ల మఖానం చేరుకుని మౌలాలిస్వామిని దర్శించుకున్నారు. బాసికాలు, పూలదట్టీలు, గొడుగులు సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

యూరియా కోసం రైతుల పాట్లు



యూరియా కోసం రైతు సేవా కేంద్రానికి వచ్చిన రైతులు

వెలుగోడు: యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గురువారం యూరియా కొరకు రైతులు రైతు సేవా కేంద్రం వద్ద బారులు తీరారు. ఇటీవల మండలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. రెండు రోజుల నుంచి యూరియా కోసం రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నామని, అవసరమైనంత ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో అవి సరిపోవడం లేదని రైతులు వాపోతున్నారు. రైతులకు సరిపడా యూరియా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు అనుగుణంగా యూరియాను అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని మండల వ్యవసాయ అధికారిణి స్వాతి తెలిపారు. మండలానికి 730 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు ఆమె చెప్పారు. రైతులు అవసరానికి మించి కొనుగోలు చేస్తుండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె వివరణ ఇచ్చారు.

పైర్లు కాపాడుకోండి



అల్లూరు వద్ద మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త పి.సుజాత, ఏడీఏ గిరీష్

నందికొట్కూరు/జూపాడుబంగ్లా: వర్షపు నీటిని కాలువల ద్వారా బయటకు పంపి పైర్లను కాపాడుకోవాలని కర్నూలు ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త పి.సుజాత రైతులకు సూచించారు. గురువారం నందికొట్కూరు మండలం అల్లూరు సమీపంలోని నీట మునిగిన మొక్కజొన్న పంటను, జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామ పరిధిలోని పత్తిపంటలను పరిశీలించారు. రెండు రోజులకు మించి పొలంలో వర్షపు నీరు నిలువ ఉంటే దిగుబడికి నష్టమని, వెంటనే పొలంలో కాలువలు తీసి నీటిని బయటకు పంపించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. ఆమె వెంట ఏడీఏ గిరీష్, జూపాడుబంగ్లా వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ఆత్మకూరు: ఈనెల 23న ప్రకాశం జిల్లా ఒంగోలులో జరగబోయే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ తాలూకా కార్యదర్శి టి.ప్రతాప్, పట్టణ కార్యదర్శి అమ్మన్‌హుసేన్ కోరారు. గురువారం వారు స్థానిక పార్టీ కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందేళ్ల పూర్తి చేసుకున్న సీపీఐ.. ప్రజా, రైతు సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కేజీ రోడ్ హమాలీ యూనియన్ నాయకులు చాంద్‌బాషా, లల్లు, రఫీ, రజాక్‌మియా, మున్సిపల్, ఏఐటీయూసీ నాయకులు బీసన్న, నాగరాజు, అలీషేర్ పాల్గొన్నారు.

నేటి మధ్యాహ్నం నుంచి ఉచిత బస్సు ప్రారంభం

ఆత్మకూరు: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని సీఎం చంద్రబాబునాయుడు శుక్రవారం ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం నుంచి అమలులోకి వస్తుందని ఏపీఎస్ఆర్టీసీ ఆత్మకూరు డిపో మేనేజర్ వినయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన సీఐ కోటానాయక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. మహిళలకు మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఉచిత బస్సు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ కోటానాయక్ పాల్గొన్నారు.

ఇన్ లెట్ చానెల్ నిర్మాణంతోనే శాశ్వత పరిష్కారం



నీట మునిగిన పంట పొలాలను చూపుతున్న రైతు సంఘం నాయకులు

పాములపాడు: ఎస్ఆర్ఎంసీ కాల్వకు అనుసంధానంగా ఇన్ లెట్ చానెల్ నిర్మాణంతోనే భవనాసి నది పరివాహక ప్రాంత పొలాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని చిలిమిళ్ల గ్రామంలో వర్షం నీటిలో మునిగిపోయిన పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా వర్షాకాలంలో భవనాసి నది వెంట పైర్లు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ సమస్యపై పలుమార్లు జిల్లా అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రస్తుతం వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40,000 చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పరిస్థితిని అర్థం చేసుకుని శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వెంకటేశ్వరరావు, స్వామన్న, బాలయ్య బాధిత రైతులు పాల్గొన్నారు.

రక్షణ గోడలు నిర్మించాలి



ధర్నాలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బండి ఆత్మకూరు: మండల కేంద్రంలోని కుందూ నది మీద ఉన్న బ్రిడ్జిపై రక్షణ గోడలు నిర్మించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పూల వెంకట సుబ్బన్న డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జిపై రక్షణ గోడ లేకపోవడంతో ఇటీవల వికలాంగుడు రమణ రెడ్డి తన మూడు చక్రాల సైకిల్‌తో సహా జారిపడి మృత్యువాత పడ్డాడన్నారు. దీనికి అధికారులే బాధ్యత వహించాలన్నారు. మరిన్ని ప్రమాదాలు జరగకుండా రక్షణ గోడలు నిర్మించాలన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

కామేశ్వరీదేవికి నేడు నెమలి పింఛములతో అలంకరణ

మహానంది: శ్రావణమాసం, నాలుగవ శుక్రవారం సందర్భంగా మహానందిలో కొలువైన కామేశ్వరీదేవికి నెమలి పింఛములతో అలంకరణ ఉంటుందని వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని గురువారం తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తొలిసారి సుమారు 1,500 పింఛములతో తయారు చేసిన మాలలతో అమ్మవారికి అలంకరణ ఉంటుందన్నారు. తమిళనాడు రాష్ట్రం అంబూరు నుంచి వచ్చిన నైపుణ్యం కలిగిన వారు నెమలి పింఛములతో మాలలు, తోరణాలు సిద్ధం చేస్తున్నారన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి

పగిడ్యాల: మండలంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత విద్య కోసం మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాధికారి సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఏళ్ల నిండిన బాలబాలికలు ఒకటవ తరగతిలో ప్రవేశం పొందేందుకు విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రభుత్వం 20 శాతం సీట్లు కేటాయించిందన్నారు. ఈనెల 20వ తేదీలోగా ఆసక్తి కలిగిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.1.44 లక్షలకు మించి ఉండరాదన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్లస్టర్ వర్సిటీ ఐక్యూఏసీ కమిటీ ఏర్పాటు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు వర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ సలహా కమిటీని ఏర్పాటు చేస్తూ రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ చైర్మన్‌గా వీసీ, ఏఓలుగా రిజిస్ట్రార్, పరీక్షల విభాగం డీన్, పరిపాలన విభాగం డీన్, అకడమిక్ విభాగం డీన్, సిల్వర్‌జూబ్లీ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ, కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాళ్లను నియమించారు. డైరెక్టర్‌గా కేవీఆర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ మహబూబ్ బాషా, డిప్యూటీ డైరెక్టర్లుగా సిల్వర్ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ జి.ఎల్లా క్రిష్ణ, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ అధ్యాపకులు డాక్టర్ కె.జీ మల్లికార్జున, సభ్యులుగా రాధారమణి (కేవీఆర్ కాలేజీ), బి.మసూదా వలి (ప్రభుత్వ పురుషుల కాలేజీ), సీహెచ్.నాగ సురేష్ (సిల్వర్‌జూబ్లీ కాలేజీ), ధర్మేందర్ (పురుషుల కాలేజీ), ఏబీఎల్ పావని (కేవీఆర్), ఆచార్య ఎస్.మన్సూర్ రెహ్మాన్ (సాసైటీ), ఎస్.రాజశేఖర్ (ఫస్ట్ స్టెప్ టెక్నాలజీస్), పి.విజయ (ఏపీ టూరిజం), విజయకుమార్ రెడ్డి (సాయి డెకరేటర్స్), కురువ రమేష్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ బాంబే) కమిటీలో ఉన్నారు.

ఐ కలెక్షన్ సెంటర్‌గా గుర్తింపు

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని సుశీల నేత్రాలయకు ఐ కలెక్షన్ సెంటర్‌గా అనుమతినిస్తూ డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ ఉత్తర్వులు జారీ చేశారు. కాపీని గురువారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కంటి వైద్యులు పి.సుధాకర్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుశీల నేత్రాలయలో ఇప్పటివరకు 100కు పైగా కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేశామన్నారు. ఇకపై తాము సేకరించే నేత్రాలు హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్, వాసన్ ఐ బ్యాంక్‌లకు పంపి వారి ద్వారా తిరిగి పొంది ఇక్కడ కార్నియా మార్పిడి ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

చెరువులను సంరక్షించుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

జూపాడుబంగ్లా: చెరువులను సంరక్షించుకోవటంతోపాటు భూగర్భ జలాలు పెరిగేలా చూడాల్సిన బాధ్యత సాగునీటి సంఘాలదేనని కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్, మైనర్ ఇరిగేషన్ ఏఈ గౌతం తెలిపారు. గురువారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దారు చంద్రశేఖర్‌నాయక్, పాములపాడు తహసీల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీఓ గోపికృష్ణ, కేసీ కాల్వ ఏఈ, ఎంఐ ఏఈ, సాగునీటి సంఘాల కమిటీ సభ్యులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఏఈలు శ్రీనివాసనాయక్, గౌతం మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువుల పటిష్టతను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవటంతో పాటు వాటిభద్రతను సాగునీటి సంఘాల కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షించటంతో పాటు అధికారులకు సమాచారం తెలియజేయాలన్నారు. పంటకాల్వలను ఆధునీకీకరించుకోవటం, చెక్‌డ్యాంలను నిర్మించుకోవటం వంటివి చేయటం వల్ల భూగర్భజలాలు పెరిగేలా చూడాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద రైతుల పొలాల్లో ఫాంపాండ్స్, చెక్‌డ్యాంల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. ఇకపై సాగునీటి సంఘాల కమిటీ సభ్యులు అధికారులతో మమేకమై భూగర్భ జలాల పెంపునకు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో సాగునీటి సంఘాల వైస్‌ప్రెసిడెంట్ చంద్రేష్ పాల్గొన్నారు.

ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



వేషధారణలో చిన్నారులు



కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు

నందికొట్కూరు: పట్టణంలోని స్కాలర్ స్కూల్‌లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణ జన్మాష్టమి వృత్తాంతాన్ని విద్యార్థులకు వివరించారు. శ్రీకృష్ణుడి, గోపికల వేషధారణలో చిన్నారులు అలరించారు.

వెలుగోడు: పట్టణంలోని బృందావన్ స్కూల్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్నారులు గోపికమ్మలుగా, శ్రీకృష్ణులుగా వేషధారణలతో, నృత్యాలతో ఆకట్టుకున్నారు. ఉట్టి మహోత్సవం కోలాహలంగా జరిగింది. కరస్పాండెంట్ ఫయాజ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా చిన్నారుల్లో మతసామరస్యాన్ని పెంపొందింపవచ్చన్నారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంచిపెట్టారు.

దేశ భవిష్యత్తుకు పునాదులుగా నిలవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: విద్యార్థులు దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.సునీత సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి గురువారం కళాశాల నుంచి హర్ ఘర్ తిరంగా మహోత్సవం, ఆజాదీకా అమృత మహోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గడపలో జాతీయ పతాక ఆవిష్కరణ, త్యాగానికి ప్రతీకగా నిలిచిన త్రివర్ణ పతాకం ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పరిమళాదేవి, రఘుపతి, హుసేన్, ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల సందడి



చిన్నకోనేరులో భక్తుల పుణ్యస్నానాలు

మహానంది: శ్రావణమాసం సందర్భంగా మహానందిలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం, సాయంత్రం స్వామి, అమ్మవారికి అష్టవిధ మహామంగళ హారతులు చేపట్టారు. ఉదయం స్థానిక కల్యాణ మండపంలో మహానందీశ్వరస్వామి దంపతులకు కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.